## క్లుప్తంగా

### సరస్వతి విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సరస్వతి విగ్రహం పనులకు శుక్రవారం సర్పంచ్ కోడి కృష్ణవేణి భూమి పూజ చేశారు. ఎంపీటీసీ బేతం రామకృష్ణ, ఉపసర్పంచ్ చావా వీరరాఘవులు, మాజీ సర్పంచ్ స్వర్గం బాలనర్సయ్య, మాజీ ఉపసర్పంచ్ కమటం వెంకన్న, హెచ్ఎం ప్రేమ్‌సాగర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

### భరోసా సభను విజయవంతం చేయాలి



పోస్టర్లు అంటిస్తున్న నాయకులు

దుమ్ముగూడెం: హైదరాబాద్ విద్యార్థి అమరుల ప్రాంగణం సరూర్ నగర్‌లో ఆదివారం బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్.యస్.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన 'తెలంగాణ భరోసా సభ' ను జయప్రదం చేయాలని పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కొప్పుల నారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం తెలంగాణ భరోసాసభను జయప్రదం చేయాలని కోరుతూ గ్రామాల్లో వాల్ పోస్టర్లు అంటిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కొప్పుల నారాయణ, కార్యదర్శి పొడుతురి రవీంద్ర ప్రసాద్, కోశాధికారి సాగర్ పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలుకు కృషి

ములకలపల్లి : రైతుల పండించిన ధాన్యం కొనుగోలుకు అహర్నిశలూ కృషి చేస్తున్నట్టు ములకలపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ నడిపల్లి సునంద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో అన్నదాత అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టుకొని, తేమ 17 శాతం ఉన్నప్పుడు మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించాలన్నారు.

### మినీ మహానాడును జయప్రదం చేయండి

అశ్వారావుపేటరూరల్: ఈ నెల 7న సత్తుపల్లిలో జరిగే మినీ మహానాడును జయప్రదం చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కట్రం స్వామి దొర కోరారు. అశ్వారావుపేటలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టీడీపీ వ్యవస్థాపకులు, దివంగత నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన మినీ మహానాడు కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్నీ మండలాల నుంచి పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు నార్లపాటి శ్రీనివాసరావు, నాయకులు వెంకటేశ్వర రావు, ఉదయ్, సురేష్, నాగేంద్ర పాల్గొన్నారు.

### మహాసభకు తరలిన నాయకులు

అశ్వారావుపేటరూరల్: భద్రాచలంలో జరిగిన తెలంగాణ అటవీ ప్రాంత గిరిజన సంఘం మహా సభలకు శుక్రవారం మండలం నుంచి సీపీఎం పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. సీపీఎం మండల కార్యదర్శి బుడితి చిరంజీవి, జిల్లా కమిటీ సభ్యులు పిట్టల అర్జున్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులంతా బహిరంగ సభకు వెళ్లారు.

### బైక్ చోరీపై కేసు

భద్రాచలంఅర్బన్: బైక్ చోరీపై స్థానికపోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. టౌన్ ఎస్సై ఐ.మధుప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి ఆనుకుని ఉన్న సరిహద్దు గ్రామం అయిన ఏటపాకకు చెందిన మల్లికార్జున్ ఈ నెల 3న తన ద్విచక్ర వాహనాన్ని పట్టణంలోని యూబీ రోడ్డులో గల ఓ ఫైనాన్స్ కంపెనీ వద్ద పార్కింగ్‌లో పెట్టాడు. తన కార్యక్రమాలు పూర్తి చేసుకొని వచ్చి చూడగా తన వాహనం చోరీకి గురైంది. ఈ క్రమంలో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా టౌన్ ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

### కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

దుమ్ముగూడెం: కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ జీఓ జారీ చేయడంతో మండలంలోని దుమ్ముగూడెం, నరసాపురం పర్ణశాల పీహెచ్‌సీలోని కాంట్రాక్టు సిబ్బంది కేసీఆర్, మంత్రి హరీష్‌రావుల చిత్రపటాలకు శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఫార్మసిస్ట్ హేమ వరలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు బాబురావు, నాగేశ్వరరావు, రాములు తదితరులు పాల్గొన్నారు.

### ఆలయంలో పూజలు

భద్రాచలంటౌన్: పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లోని శ్రీ అభయాంజనేయ స్వామివారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# బాగుచేస్తే దూరం తగ్గినట్టే..

**శిథిలావస్థలో కే.ఎన్.పేట వంతెన**

- బలహీనమైన బ్రిటీష్ కాలం నాటి వారధి
- మరమ్మతు చేయించాలని స్థానికుల వినతులు



నావిగేషన్ కెనాల్‌పై శిథిలావస్థకు చేరిన ఐరన్ వంతెన

దుమ్ముగూడెం: మండలంలోని కే.ఎన్.పేట–దుమ్ముగూడెం మధ్య ఐరన్ వంతెన శిథిలావస్థకు చేరి కూలిపోయే స్థితికి చేరుకుంది. 1853 సంవత్సరంలో దుమ్ముగూడెం గోదావరి నది నావిగేషన్ కెనాల్‌పై కేఎన్.పేట–దుమ్ముగూడెం మధ్యన ఐరన్ ఫుట్ బ్రిడ్జి నిర్మించి రహదారి ఏర్పాటు చేశారు. దీంతో దుమ్ముగూడెంలోకి వచ్చి వెళ్లేందుకు దగ్గర రహదారి ఏర్పడింది. కాలక్రమేణా ఐరన్ షీట్లకు చిల్లులు పడి ప్రమాదకరంగా మారింది. దుమ్ముగూడెంలోకి క్రాస్ రోడ్డు నుండి సుమారు 2 కి.మీ., లక్ష్మీనగరం నుండి 3.5 కి.మీ. ఉంటుంది. ఈ వంతెనను మరమ్మతు చేస్తే గ్రామంలోకి కాలినడకన వచ్చే వారికి భారం తగ్గుతుంది.

**అధికారుల నిర్లక్ష్యం..**

ఐరన్ వంతెన నిర్వహణలో నీటి పారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. గతంలో దుమ్ముగూడెం వ్యాపారకేంద్రంగా ఉన్న సమయాన నావిగేషన్ ప్రాంతాన్ని అభివృద్ధి చేశారు. అనంతరం నీటి పారుదల శాఖ అధికారులు పలుమార్లు వంతెనను తాత్కాలిక మరమ్మతు చేయించినా ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరి రెండు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బ్రిడ్జి కూలిపోకముందే కొత్త వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు.

**రైతులకు ఉపయోగం..**

కే.ఎన్.పేట–దుమ్ముగూడెం మధ్య నావిగేషన్ కెనాల్‌పై పాత వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. దుమ్ముగూడెం రైతులు, రైతు కూలీలు కే.ఎన్.పేట వైపు రావాలంటే ప్రస్తుతం మూడు కిలోమీటర్ల దూరమవుతుంది. అదే వంతెన నిర్మిస్తే 300 మీటర్లు నడిస్తే గమ్యస్థానాన్ని చేరుకోవచ్చు. వ్యవసాయ సీజన్ సమయంలో రైతులు రాత్రి వేళ పంట పొలాలకు వెళ్లేందుకు చుట్టూ తిరగాల్సి వస్తున్నందున పాత వంతెనను మరమ్మతు చేయించడమో లేదంటే నూతన వంతెన నిర్మించడమో చేయాలి. ఇది జరిగితే గ్రామస్తులతో పాటు పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు దూరాభారం తగ్గుతుంది. ఈ మేరకు అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

**అధికారుల స్పందన కరువు..**



శిథిలావస్థకు చేరిన ఐరన్ వంతెన మరమ్మతు చేయించాలని అధికారులను ఎన్నిసార్లు కోరినా పట్టించుకోలేదు. మరమ్మతు చేస్తే దుమ్ముగూడెంకు కాలినడకన వెళ్లే ప్రజలు, రైతులకు ఉపయోగపడుతుంది. అధికారుల స్పందన లేనందున దాతల చేయూత కోసం యత్నిస్తున్నాం.

– యలమంచి శ్రీనుబాబు, రైతు సంఘం నాయకుడు

**ఇబ్బంది పడుతున్నాం..**



ఐరన్ వంతెన పాడైపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. పొలాలకు చేరుకోవడానికి చుట్టూ మూడు కిలోమీటర్లు తిరగాల్సి వస్తోంది. వ్యవసాయ సీజన్‌లో రాత్రిళ్లు కష్టంగా ఉంటుంది. అధికారులు పాత వంతెన మరమ్మతు చేయించాలి లేదంటే కొత్తది నిర్మిస్తే మాకు మేలులు జరుగుతుంది.

– గోకేటి అప్పారావు, రైతు, దుమ్ముగూడెం

**మా పరిధిలో లేదు**



గోదావరి నదిపై నావిగేషన్ కెనాల్ పర్యవేక్షణ 2021 నుండి జీఆర్ఎంబీ (గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు) పరిధిలోకి వెళ్లింది. ప్రభుత్వం నుంచి కూడా మాకు పర్యవేక్షణపై సూచనలు చేయలేదు. స్థానిక వనరులతో వంతెన మరమ్మతు చేయించుకోవాలే తప్పా శాఖ నుంచి అవకాశాలు లేవు.

– రాజ్‌సుహాస్, జేఈ, నీటి పారుదల శాఖ

# కేసీఆర్ తపనంతా రాష్ట్ర అభివృద్ధిపైనే..



చెక్కు అందజేస్తున్న విప్ రేగా కాంతారావు

కరకగూడెం: సీఎం కేసీఆర్ తపనంత రాష్ట్ర అభివృద్ధిపైన అని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం కరకగూడెం మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను సుమారు 40 మంది లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ... కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, రైతు బంధు, రైతుబీమా, దివ్యాంగులకు నెలకు రూ. 3,016గా ఫించన్లు అందజేత, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, దళిత బంధు వంటి పథకాలను దేశంలోనే అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీదేనన్నారు. అలాగే రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి కులమతాలకు అతీతంగా, మహిళల సాధికారత కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అంతకు ముందు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఈ నెల 10న మండల పర్యటన నేపథ్యంలో మండలంలోని సభస్థలిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, పలు శాఖల అధికారులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 'నిరుద్యోగ యువగర్జన'కు వేలాదిగా తరలిరండి




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరయ్య

- డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య

భద్రాచలం: హైద్రాబాద్‌లోని సరూర్‌నగర్‌లో 8న జరిగే 'నిరుద్యోగ యువ గర్జన'కు యువతీ యువకులు, నిరుద్యోగులు వేలాదిగా తరలిరావాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొదెం వీరయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం భద్రాచలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్ల లీకేజీలతో నిరుద్యోగుల భవిష్యత్‌తో ఆటలాడుకున్నారని విమర్శించారు. లీకేజీల అనంతరం ఉద్యోగులు నిరాశ, నిస్పృహలతో ఉన్నారని, వారందరిలో మనోధైర్యం నింపేందుకు, పాలక పక్షాలను ప్రశ్నించేందుకు ఈ యువ గర్జనలో ప్రియాంక గాంధీ పాల్గొనబోతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు సరెళ్ల నరేష్, టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, పల్లపు దుర్గా ప్రసాద్, నాయకులు బోగాల శ్రీనివాసరెడ్డి, తిరుపతయ్య, వెంకటేష్, సుధీర్, రాము, రామనాథం, ఆవుల విజయ భాస్కర్ రెడ్డి, వసంతాల రాజేశ్వరి, సరిత, దేవకి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కార్యాలయంలో జరిగిన మరో కార్యక్రమంలో భద్రాచలం ఎల్‌డీఎంఆర్‌సీ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా నల్లపు దుర్గా ప్రసాద్‌కు నియామకపత్రాన్ని అందజేశారు.

**మల్లూరులో పూజలు..**

ములుగు జిల్లా మల్లూరులో వేంచేసియున్న హేమాచల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో జరిగిన కల్యాణానికి పొదెం వీరయ్య కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించి ప్రసాదాలను స్వీకరించారు.

# నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



చంద్రుగొండ : సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

చంద్రుగొండ : నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయమని ఈ దిశగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని గ్రామాల్లో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం బెండాలపాడులో నూతనంగా నిర్మించిన పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు.

**ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయండి**

ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయాలని అధికారులకు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సూచించారు. గుంపెన సొసైటీ ఆధ్వర్యంలో దామరచర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిశీలించగా తడిచిన ధాన్యాన్ని రైతులు ఎమ్మెల్యేకు చూపించారు.

**పెద్దమ్మతల్లికి పూజలు..**

మండలంలోని అయన్నపాలెం గ్రామంలో పెద్దమ్మ తల్లి జాతర సందర్భంగా విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తుండటంతో కార్యక్రమంలో ఎమ్మెల్యే హాజరై పూజలు నిర్వహించారు. ఆయన వెంట తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రేవతి, నాయకులు దార వెంకటేశ్వరరావు, మెడా మోహన్‌రావు, ఉప్పతల ఏడుకొండలు, చీదళ్ల పవన్‌బాబు, నల్లమోతు వెంకటనారాయణ, సూరా వెంకటేశ్వర్లు, బాబురావు, సర్పంచ్‌లు రణ్యా, కుమారి పాల్గొన్నారు.

**ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే..**

దమ్మపేట/అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని పలు గ్రామాలలో నిర్వహించిన విగ్రహాలు, నాభిశిల, ధ్వజస్తంభముల ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొని పూజలు చేశారు. గుంపెన, కొండాయిగూడెం గ్రామాలలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయస్వామి, ముత్యాలమ్మ తల్లి ఆలయాల్లో విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలను నిర్వహించారు. బీజేపీ జాతీయ మీడియా సెల్ కో ఆర్డినేటర్ రంగాకిరణ్, బోయినపల్లి సుధాకర్‌రావు, మారగాని శ్రీనివాసరావు, రామారావు, నున్నా బసవయ్య, లక్ష్మణరావు, రమేష్, రాంబాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### జేపీఎస్‌లకు మద్దతుగా..



జీపీ కార్యాలయానికి తాళం వేస్తున్న సిబ్బంది

ములకలపల్లి: జూనియర్ గ్రామపంచాయతీ కార్యదర్శులకు అండగా సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథాకు చెందిన రాచన్నగూడెం సర్పంచ్ కొర్సా గణపతి, స్థానిక సిబ్బంది మద్దతు ప్రకటించారు. శుక్రవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయానికి తాళం వేసి, సంఘీభావం ప్రకటించారు. మద్దతు ప్రకటించిన వారిలో ఉపసర్పంచ్ ఒగ్గెల వెంకటేశ్, వార్డు సభ్యులు పద్దం రాఘవులు, ఊకే విజయ, కుంజా ప్రభుకుమార్, మడివి గంగాభవాని, మల్టీపర్పస్ వర్కర్లు గడ్డం నాగరాజు, పద్దం పాపారావు, కుంజా సత్యనారాయణ, కుంజా రవి, ఒగ్గెల రవి తదితరులు పాల్గొన్నారు.

### దళారులకు అమ్ముకోవద్దు

గుండాల: యాసంగిలో ఆరుగాలం శ్రమించి పండించిన పంటను దళారులకు అమ్మి నష్టపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని జెడ్పీటీసీ వాగబోయిన రామక్క, ఎంపీపీ ముక్తి సత్యం, పీఏసీఎస్ చైర్మన్ గొగ్గెల రామయ్య అన్నారు. శుక్రవారం స్థానిక పీఏసీఎస్ నందు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మండలంలో అధిక శాతం మొక్కజొన్న సాగు చేయడం జరిగిందని ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీసీసీ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వర్లు, ఈసం క్రిష్ణ, పాపారావు, నర్సింహరావు, సొసైటీ సిబ్బంది రాంమూర్తి, కాంతారావు, యాకూబ్ పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

# ఆర్ఎంపీలకు గుర్తింపునివ్వాలి



మాట్లాడుతున్న బండి కొమరయ్య

ములకలపల్లి: ప్రభుత్వం గ్రామీణ వైదులకు (ఆర్ఎంపీ) శిక్షణ ఇచ్చి, తగిన గుర్తింపునివ్వాలని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి కొమరయ్య అన్నారు. మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో సంఘం మండలాధ్యక్షుడు విశ్వాస్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుమూల గ్రామాల్లో సైతం ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే ఆర్ఎంపీల అభివృద్ధికి పాలకపక్షాలు చొరవ చూపాలన్నారు. అనంతరం పలువురు ఆర్ఎంపీలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు కొమ్ము నాగరాజు, మండల ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, అందె రమేశ్, రాంబాబు, సుభానీ, ఖన్నా, రామాచారి, హరిబాబు వెంకటేశ్వర్లు, కేశవులు, ప్రకాశ్, రాము తదితరులు పాల్గొన్నారు.

### తునికాకు బోనస్ విడుదలపై హర్షం

దుమ్ముగూడెం: 2016 సంవత్సరం నుంచి 2021 సంవత్సరం వరకు భద్రాచలం డివిజన్‌లో పెండింగ్ లో ఉన్న తునికాకు బోనస్ సొమ్ము సుమారు 30 కోట్ల రూపాయలను విడుదల చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నట్టు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అన్నె సత్యనారయణమూర్తి తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కార్మికుల తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఈ నెల 10న దుమ్ముగూడెం మండలంలో అటవీ శాఖా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి చేతుల మీదుగా తునికాకు కార్మికులకు బోనస్ అందించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రధాన కార్యదర్శి కణితి రాముడు, జానీపాషా, అపకా వీర్రాజు, శ్రీనివాస్, అడ్వకేట్ మల్లేశ్వర రావు, గంగరాజు, రాము పాల్గొన్నారు.

# ఘనంగా లక్ష్మీ నృసింహుని కల్యాణం



భద్రాచలం: కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంకు అనుబంధంగా ఉన్న పట్టణంలోని శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం కల్యాణోత్సవంను వైభవోపేతంగా జరిపారు. తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా మూలవరులకు ఉదయం అభిషేకంను నిర్వహించారు. అనంతరం స్వామి వార్లకు కల్యాణ తంతును రామాలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు ఆధ్వర్యంలో కమనీయంగా జరిపారు. కాగా తిరుకల్యాణోత్సవాలలో భాగంగా శనివారం రథోత్సవం, ఆదివారం దొంగల దోపు, తెప్పోత్సవంలను జరపనున్నారు. సోమవారం పూర్ణాహుతితో ఉత్సవాలకు ముగింపు పలకనున్నారు.

దమ్మపేట: మండల పరిధిలోని నాగుపల్లి గ్రామంలో వెంచేసియున్న శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు హాజరై పూజలు నిర్వహించగా ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. పటేల్, వెంకయ్య, శ్రీను పాల్గొన్నారు.



చర్ల: సుబ్బంపేటలో..

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల కాలనీ గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కళ్యాణ మహోత్సంలో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సతీమణి రేగా సుదారాణి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ పాయం భద్రయ్య, ఉపసర్పంచ్ ఎన్నా అశోక్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, వైస్ ఎంపీపీ వీరభద్రం, సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, గద్దల రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

చర్ల: మండలంలోని సుబ్బంపేట గ్రామపంచాయతీలో గల సమ్మక్క సారలమ్మ గద్దెల సమీపంలో అబ్బరాసి బండల వద్ద శుక్రవారం నిర్వహించిన లక్ష్మీనర్సింహాస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా సాగింది. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ నిర్వహించిన ఈ కల్యాణ మహోత్సవానికి చర్ల, వెంకటాపురం మండలాల్లోని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



దమ్మపేట: తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే



అశ్వాపురంలో..

### ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం



తరగతులకు హాజరైన విద్యార్థులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం కూనవరంరోడ్డులోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఆవాస విద్యాలయంలో ఉచిత కంప్యూటర్, యోగా శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పాఠశాల ప్రిన్సిపాల్ గీత మాట్లాడుతూ... ఈ తరగతులను ఎస్‌టుటెక్ హైదరాబాద్ వారి సౌజన్యంతో ప్యాకల్టీ భావన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారన్నారు. ఈ నెల 25 వరకు నిర్వహించే తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### కూలీల హాజరు పెంచకపోతే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు


అశ్వారావుపేటరూరల్: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ప్రతీ గ్రామ పంచాయతీలో రోజుకు వందమంది కూలీలు హాజరు కావాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి కూలీల హాజరు సంఖ్యను పెంచాలని, పంచాయతీ పరిధిలో ప్రతి రోజు వంద మందికి ఉపాధి చూపించాలన్నారు. ఎంపీఓ సీతారామరాజు, ఏపీఓ తలపుల నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

### సీనియర్ జర్నలిస్ట్ మృతికి సంతాపం

బూర్గంపాడు: బూర్గంపాడుకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ జలసూత్రం జనార్దన్(68) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతిచెందగా శుక్రవారం పలువురు సంతాపం తెలిపారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతు మృతిచెందాడు. బూర్గంపాడులోని ఆయన స్వగృహంలో ఆయన మృతదేహాన్ని పలువురు జర్నలిస్ట్‌లు, ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో జర్నలిస్ట్‌లు డి.పున్నంచంద్, కామిరెడ్డి నాగిరెడ్డి, తోకల మోహన్‌రావు, పండగ రాములు, కొమ్ము శ్రీనివాస్, దుద్దుకూరి రామకృష్ణ, పల్లంటి రమేష్, తేజావత్ గాంధీ తదితరులు ఉన్నారు.

**అటెన్షన్ ప్లీజ్**

## రహదారిపైకి మురుగునీరు



మండల పరిధిలోని జగ్గారం తండా వద్ద డ్రెయినేజీపై ఉన్న వంతెన భూమిలో కూరుకుపోయింది. దీంతో మురుగునీరు మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారిపైకి చేరుతోంది. ఫలితంగా వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ప్రధాన రహదారి నుండి జగ్గారం తండా రహదారి అధ్వానంగా మారింది. – అశ్వాపురం

ప్రశ్నించాల్సిన అధికారి : ఖాజాహుస్సేన్, పంచాయతీ కార్యదర్శి, జగ్గారం
సెల్ నంబర్ : 8500912845